సాక్షి
నిర్మల్
సోమవారం । 24 । మార్చి । 2025



ట్రాఫికర్ తీరేదెన్నడో! 9లో▸
జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. రోడ్లపై వాహనాలు నిలిపేవారు, రోడ్లను ఆక్రమించి చిరువ్యాపారాలు చేసేవా రితోనే సమస్య తీవ్రమవుతోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:24	మంగళ : 5:01

గరిష్టం/కనిష్టం
36.0 /22.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంస్థ అభివృద్ధికి సహకరించాలి



డీఎంను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగులంతా సహకరించాలని నిర్మల్ డీఎం పండరి సూచించారు. ఆదివారం ఇటీవల డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పండరిని నిర్మల్ డిపోలో సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఆదిలాబాద్ రీజియన్‌లో నిర్మల్ డిపో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఈ స్థానాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు. సిబ్బంది గంగాధర్, శేఖర్, నరేందర్, రమేశ్, సుజాత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గజ్జలమ్మకు పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: మండల కేంద్రంలోని గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, పల్లకీసేవ నిర్వహించారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బాసరలో శ్రమదానం



వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

బాసర: బాసర జ్ఞాన సరస్వతీ ఆలయ సిబ్బంది, శ్రీ ప్రణవపీఠం పీఠాధిపతి వద్దిపర్తి పద్మాకర్‌కు చెందిన 85 మంది శిష్యులు, విశ్వనాథ్ పూర్ణిమ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఆలయం, గోదావరి నది పుష్కరఘాట్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి సుదర్శన్‌గౌడ్, పర్యవేక్షకుడు, శివరాజ్, నారాయణ పటేల్, సిబ్బంది పాల్గొన్నారు.


'హామీలు మరిచిన కాంగ్రెస్'



సమావేశంలో మాట్లాడుతున్న రితేశ్‌రాథోడ్

కడెం: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు మరిచిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేశ్‌రాథోడ్ ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.2,500, నిరుద్యోగభృతి ఇవ్వకుండా, రైతు రుణమాఫీని పక్కాగా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందని విమర్శించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి వెచ్చిస్తున్న నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని చెప్పారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని భర్త దుర్గయ్యకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా అతడిని పరామర్శించారు. ఇటీవల మరణించిన సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేని శ్రీనివాస్, నాయకులు అమరవేని రవీందర్ గౌడ్, మోహన్‌నాయక్, ముల్కి కృష్ణ, ప్రవీణ్, శ్రీరాం, నగేశ్, తిరుమల్ తదితరులున్నారు.

'బర్డ్ వాచ్'కు డిగ్రీ విద్యార్థులు



అటవీశాఖ అధికారులు, విద్యార్థులు

మామడ: జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు 'ట్రెయిన్ టు ట్రెయినర్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం దిమ్మదుర్తి రేంజ్ పరిధిలోని తుర్కం చెరువు, పొన్కల్ చెరువు, యెంగన్న చెరువుల పరిధిలో ఎకో టూరిజం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు బర్డ్ వాచింగ్, జంతువుల గుర్తింపుపై శిక్షణ ఇచ్చారు. సఫారి, నేచర్, రాత్రి క్యాంపు ఫైర్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాసర సీసీఎఫ్ శర్వనన్, డీఎఫ్‌వో నాగినిభాను, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రావు, రామకృష్ణారావు, ఎఫ్ఎస్వో శ్రీనివాస్, అన్నపూర్ణ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ అయ్యేదెప్పుడో!

- విస్తరించని ఏరియాస్పత్రి సేవలు
- 25 ఏళ్లయినా ఇంకా 100 పడకలే..
- 150కి పెంచాలని ఏళ్లుగా డిమాండ్
- జనాభా పెరిగినా సేవలు అంతంతే
- భైంసావాసులకు అరకొర వైద్యమే..



భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి

భైంసాటౌన్: డివిజన్ కేంద్రమైన భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రి సేవలు విస్తరించడంలేదు. పెరిగిన జనాభాకు తగినట్లు ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడంలేదు. ఆస్పత్రి ఏర్పడి దశాబ్దాలు గడిచినా అప్పటి నుంచి 100 పడకలతో సరిపెడుతున్నారు. ప్రస్తుతం భైంసా పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల నుంచి రోగుల తాకిడి విపరీతంగా ఉంది. అత్యవసర సమయంలో సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో టీవీవీపీ ఆధ్వర్యంలో కొనసాగాల్సిన జిల్లా ఆస్పత్రిని భైంసాలో ఏర్పాటు చేయాలన్న డిమాండ్ డివిజన్ వ్యాప్తంగా వినిపిస్తోంది.

మూడు దశాబ్దాలైనా పట్టింపేది?

కమ్యూనిటీ ఆస్పత్రిగా ఉన్న భైంసా ఆస్పత్రిని 1996లో ఏరియాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి వంద పడకలకు పెంచారు. అప్పటి జనాభా, ఆస్పత్రికి రోగుల తాకిడికి అనుగుణంగా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశారు. అప్పట్లో నగర పంచాయతీగా ఉన్న భైంసా పట్టణం తరువాత క్రమంలో మున్సిపాలిటీగా మారింది. ఆ తర్వాత డివిజన్‌కేంద్రంగా కూడా ఏర్పడింది. పట్టణ జనాభాతోపాటు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లోని ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక ప్రభుత్వ ఏరియాస్పత్రి ఇది. నిర్మల్ తర్వాత విద్య, వైద్యం, వ్యాపార, వాణిజ్య, మార్కెటింగ్ పరంగా భైంసా అన్నివిధాలా అనుకూలంగా ఉంది. ఇతర జిల్లాల నుంచి వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు నిత్యం వేలసంఖ్యలో భైంసాకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో భైంసాలోని ఏరియాస్పత్రికీ రోగుల తాకిడి విపరీతంగా ఉంటోంది. వ్యాధుల సీజన్‌లో ఆస్పత్రిలో రోజుకు సరాసరి 500–600కు పైగా ఓపీ నమోదవుతోంది.

వసతులు, సిబ్బంది అంతంతే..

భైంసాలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో సరైన వసతులు, సరిపడా సిబ్బంది లేక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో మేల్, ఫిమేల్ వార్డులు, క్యాజువాలిటీ, ఆరోగ్యశ్రీ, ఆర్థో, సర్జరీ, డెలివరీ, ఎస్‌ఎన్‌సీయూ, పీడియాట్రిక్.. ఇలా తొమ్మిది విభాగాలకు షిఫ్టుకు ఇద్దరేసి చొప్పున నర్సులు ఉండాల్సి ఉండగా, 19 మందే ఉన్నారు. వైద్యులూ పూర్తిస్థాయిలో లేరు. రెగ్యులర్ వైద్యులు లేక పలువురు కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. డెలివరీ కేసులకు సరిపడా సిబ్బంది లేరు. సీటీ స్కాన్ సౌకర్యం లేక నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో రూ.వేలల్లో బిల్లులు వెచ్చించలేని నిరుపేదలు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో రిఫర్..

డివిజన్ పరిధిలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలబారిన పడినవారిని భైంసాలోని ఏరియాస్పత్రికి తీసుకువస్తారు. ఆయా సందర్భాల్లో స్థానిక వైద్యులు అందుబాటులో ఉన్న వసతులతోనే చికిత్స అందిస్తున్నారు. అయితే, క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు, అత్యవసర సమయాల్లో నిజామాబాద్, ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో సకాలంలో వైద్యం అందక ఎంతోమంది క్షతగాత్రులు మధ్యలోనే ప్రాణాలొదులుతున్నారు. జిల్లాలోనే అధికంగా డెలివరీ కేసులు భైంసా ఆస్పత్రిలోనే నమోదవుతున్నాయి. వీటితోపాటు సీజనల్ వ్యాధుల సమయంలో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది.

జిల్లా ఆస్పత్రిగా మార్చితేనే..

జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా మార్చారు. టీవీవీపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జిల్లా ఆస్పత్రిని భైంసాలోని ఏరియాస్పత్రిలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మేరకు ఏరియాస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఇక్కడి ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మల్ తర్వాత వైద్యపరంగా రోగుల తాకిడి ఎక్కువగా ఉండే భైంసా ఏరియాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా వైద్యులు, సిబ్బందితోపాటు వసతులు పెరిగి ఇక్కడి ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఏరియాస్పత్రిలో పోస్టుల వివరాలు

పోస్టు	మంజూరు	భర్తీ	ఖాళీలు
సివిల్ సర్జన్ స్పెషలిస్ట్	13	7	6
డిప్యూటీ సివిల్ సర్జన్	10	3	7
సివిల్ అసిస్టెంట్ సర్జన్	22	17	5
డిప్యూటీ డెంటల్ సర్జన్	1	1	–
డెంటల్ అసిస్టెంట్ సర్జన్	1	1	–
హెడ్ నర్స్	5	5	–
స్టాఫ్ నర్స్	26	19	7
మిడ్‌వైఫ్స్	2	–	2
ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)	6	2	4

అప్‌గ్రేడ్ చేయాలి



భైంసా పట్టణం నానాటికీ విస్తరిస్తున్నా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సేవలందడంలేదు. పెరిగిన జనాభా, రోగుల తాకిడికి అనుగుణంగా ఏరియాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి. జిల్లా ఆస్పత్రిని భైంసాలో ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రాంతప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.
– డాక్టర్ రామకృష్ణాగౌడ్, ఆరోగ్యభారతి రాష్ట్ర సభ్యుడు

రోగులకు ఇబ్బందవుతోంది



భైంసా ఏరియాస్పత్రిలో అత్యవసర సేవలు అందడంలేదు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులో లేవు. అత్యవసర సమయాల్లో వైద్యులు ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తుండగా పేదలపై ఆర్థికభారం పడుతోంది. భైంసా ఏరియాస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి.
– జి.రాజు, సీపీఐ (ఎంఎల్) నాయకుడు, భైంసా

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే రామారావుపటేల్
- పశువైద్యశాల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న రామారావు పటేల్

భైంసాటౌన్: నియోజకవర్గంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పీ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మండల పశువైద్యశాల నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్ చొరవతోనే ప్రభుత్వం నియోజకవర్గంలో రైతుల పొలాలకు వెళ్లే దారులు నిర్మిస్తోందని చెప్పారు. కుభీర్, బాసర, కల్లూరులో ప్రాథమిక పశువైద్యశాలల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి బాలిక్ అహ్మద్ ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోని పశువైద్యశాల నూతన భవనంపై రైతుశిక్షణ కేంద్రం కోసం నిధుల మంజూరుకు చొరవ తీసుకుంటానని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ సింధే ఆనంద్‌రావు పటేల్, పీఆర్ డీఈఈ రాజేందర్‌రావు, పశువైద్యుడు విఠల్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ నాయకులు తాలోడ్ శ్రీనివాస్, సిరం సుష్మారెడ్డి, పోశెట్టి, గాలి రవి, తూమోల్ల దత్తాత్రి, గాలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో యువ ఉత్సవ్



గోవర్ధన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అధికారులు

బాసర: బాసర ఆర్జీయూకేటీలో శనివారం టెక్‌ఫెస్ట్–2025లో భాగంగా యువ ఉత్సవ్‌ను మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగి, ఆదిలాబాద్ జిల్లా యూత్ ఆఫీసర్ సుశీల్ భడ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. జాతీయ సమైక్యతను ప్రోత్సహించడం, భారతదేశ వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వంపై ప్రశంసలు పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో భారతదేశ పురోగతిని ప్రదర్శిస్తూనే యువ ఆవిష్కర్తలు, కళాకారులు, నాయకులను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. భారతదేశ పురోగతిని ప్రదర్శించడం, వివిధ రంగాల్లో దేశం సాధించిన గణనీయమైన పురోగతిని హైలైట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువ కళాకారులు, యువ రచయితలు, ఛాయాచిత్ర రచన, ప్రశంసల పోటీ, సాంస్కృతిక పోటీ, సైన్స్ మేళా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2,500, తృతీయ బహుమతిగా రూ.1,500 నగదు అందించారు. ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాకేశ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ రాములు, జ్యూరీ మెంబర్లుగా డాక్టర్ లకుమాదేవి, డాక్టర్ దేవరాజు, డాక్టర్ మహేశ్, డాక్టర్ రాజేందర్, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వడ్డెరులంతా సంఘటితం కావాలి



జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్ మౌర్యతో నాయకులు

నిర్మల్‌ఖిల్లా: వడ్డెర కులస్తులంతా సంఘటితమై హక్కులు సాధించుకోవాలని భారతీయ వడ్డెర సమాజ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్ మౌర్య పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. వడ్డెరుల పలు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించబడ్డా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు బీసీ జాబితాలోనే ఉంచి అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏత్తరి మారయ్య, ప్రధాన కార్యదర్శి సంపంగి ప్రభాకర్, యువజన ఉపాధ్యక్షుడు ఒంటిపులి రాము, నాయకులు గురవయ్య, నర్సయ్య, గంగాధర్, ఎల్లప్ప, గంగారాం, శ్రీనివాస్, లక్ష్మణ్, బాజీరావు, శంకర్, ముత్యం, బంగారయ్య, మోహన్, పద్మారావు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యానికి సన్నాహాలు

- ఏప్రిల్ నుంచి పంపిణీకి కసరత్తు
- హర్షం వ్యక్తంజేస్తున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనుంది. ఎంఎల్ఎస్ పాయింట్లకు నేడో, రేపో సన్న బియ్యం చేరుకోనుండగా పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నబియ్యం పంపిణీపై అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో 2,08,606 తెల్ల రేషన్‌కార్డులుండగా 6,30,242 మంది లబ్ధిదారులున్నారు. ప్రభుత్వం నెలకు వీరికి 3,995.745 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలుంటే, వాటిని ఎంఎల్ఎస్ గోదాం నిర్వాహకులకు అప్పగించి, పూర్తిగా సన్నబియ్యం అందుబాటులో ఉంచనున్నారు. ఏప్రిల్ నుంచి డీలర్లు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో వచ్చిన సన్నవడ్లకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించి కొనుగోలు చేసిన ప్రభుత్వం మిల్లుల్లో మరాడించి బియ్యాన్ని పంపిణీకి సిద్ధం చేసింది. ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్ని తినడానికి ఇష్టపడని చాలామంది లబ్ధిదారులు దళారులకు విక్రయించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తంజేస్తున్నారు.

7నుంచి 'పది' మూల్యాంకనం

నిర్మల్ రూరల్: ఏప్రిల్ 7 నుంచి జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి మూల్యాంకనాన్ని ప్రారంభించనున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మూల్యాంకనం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి 1,27,748 జవాబు పత్రాలు జిల్లాకు చేరుకుంటాయని చెప్పారు. కోడింగ్ ప్రక్రియ కోసం కేటాయించబడ్డ సీసీవోలు, ఏసీవోలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. మూల్యాంకనానికి 535 మంది సిబ్బందిని కేటాయించగా, ఇందులో 60 మంది సీఈలు, 355 మంది ఏఈలు, 120 మంది స్పెషల్ అసిస్టెంట్లు ఉంటారని పేర్కొన్నారు. అనంతరం గతంలో చీఫ్ కోడింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన అశోక్‌వర్మ గత అనుభవాలను అధికారులకు వివరించారు. వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు.

గుండెపోటా.. వైద్యులు లేరు!



లక్ష్మణచాంద మండలం మల్లాపూర్‌కు చెందిన లింగన్న (46) హైడ్రోసిల్‌తో బాధపడుతూ ఈనెల 4న నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు. వైద్యులు పరీక్షించి ఆపరేషన్ చేయాలని చెప్పారు. వయస్సు రీత్యా 2డీ ఎకో చేయాలి. ఈ పరికరం ఉన్నా కార్డియాలజిస్టులు లేరు. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రైవేట్ కార్డియాలజిస్టును పిలిపించి ఈ పరీక్ష చేయించారు. ఈనెల 5న ఆయనకు హైడ్రోసిల్ ఆపరేషన్ చేశారు. జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్ పోస్టులు భర్తీ చేసి 2డీ ఎకో పరికరం అందుబాటులోకి తీసుకురావాల్సి అవసరం ఎంతైనా ఉంది.

- నిర్మల్ ఆస్పత్రిలో నిరుపయోగంగా 2డీ ఎకో
- కార్డియాలజిస్టు లేక ఇబ్బంది
- జనరల్ ఫిజిషియన్‌తో వైద్యం
- ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్
- అన్ని పరీక్షలు అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రం ఏర్పడ్డాక ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేసి ఏటా 150 మంది వైద్య విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల నుంచి 330 పడకల స్థాయికి పెంచారు. 20 విభాగాల్లో 22 మంది డాక్టర్లు, 201 మంది నర్సింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. కానీ గుండె సంబంధిత వైద్యులు లేరు. కార్డియాలజీ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు డాక్టర్ పోస్టులు మంజూరు చేయలేదు.

పెరుగుతున్న పేషెంట్లు

మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లు, కాలుష్యంతో జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. నిర్మల్ ఆస్పత్రికి సీజన్‌ను బట్టి ప్రతీరోజు 800 నుంచి 1000 మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తారు. ఇందులో 40 మందికి పైగా గుండె సమస్యలతో వస్తున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ముందుగా వారికి ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ తదితర పరీక్షలు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ కార్డియాలజిస్టులు లేక ఛాతిలో నొప్పి, ఇతర సమస్యలతో వచ్చిన వారిని జనరల్ ఫిజీషియన్ చూస్తున్నారు. పరీక్షలు చేసేందుకు 2డీ ఎకో మిషన్లు ఉన్నా.. ఆపరేట్ చేసే టెక్నీషియన్లు లేరు. స్టాఫ్‌నర్సు, ఇతర ఉద్యోగులతో ఈసీజీ తీయిస్తున్నారు. మిగిలిన పరీక్షలకు మిషన్లు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ డాక్టర్లు లేక హైదరాబాద్, నిజామాబాద్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వైద్యం సకాలంలో అందక మార్గమధ్యలో రోగులు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి.

రూ.లక్షల్లో ఖర్చులు

ఇటీవల జిల్లాలో గుండెపోటు బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే నిర్మల్ ప్రజలకు గుండెపోటు వస్తే అంతే సంగతులు.. అనే విధంగా మారాయి పరిస్థితులు. ఇటు ప్రభుత్వ ఆస్పత్రి.. అటు ప్రైవేట్‌లో సరైన వైద్య నిపుణులు అందుబాటులో లేక అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్‌కు పరుగులు పెట్టాల్సి వస్తోంది. దీంతో రూ.లక్షల్లో వైద్య ఖర్చులు భరించలేక బాధితులు అవస్థలు పడుతుండగా.. మరికొందరు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటుతో వచ్చే బాధితులకు ప్రాథమిక చికిత్స అందుబాటులో లేకుండా పోయింది. ఇక్కడ 2డీ ఎకో మిషన్ అందుబాటులో ఉన్నా టెక్నీషియన్ లేక నిరుపయోగమైంది. ఇక ఈసీజీ అందుబాటులో ఉన్నా రిపోర్ట్ సక్రమంగా వస్తుందా.. రాదా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్‌లోనూ అంతే..

నిర్మల్‌లో ప్రైవేట్ సెక్టార్‌లో రెండు క్యాథ్ ల్యాబ్‌లు ఉన్నాయి. ఇద్దరు కార్డియాలజిస్టులు అందుబాటులో ఉన్న కార్డియోథొరాసిక్ సర్జన్లు ఒక్కరూ లేరు. గుండెకు సంబంధించి చిన్నపాటి సర్జరీ చేయాలన్నా హైదరాబాద్ నుంచి టీమ్‌లను ఇక్కడకు రప్పిస్తున్నారు. రోగుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. చాలావరకు మేజర్ సర్జరీలు ఉంటే హైదరాబాద్‌కు వెళ్తున్నారు. స్థానికంగా రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొంతమేర సేవలు అందుబాటులో ఉన్నా ఫీజులు భారీగా ఉంటున్నాయి. యాంజియోగ్రామ్ చేయించుకోవడానికి రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చవుతోంది. ఒకవేళ స్టంట్ వేయాల్సి వస్తే అదనంగా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఈ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉండడంతో కొంతమేర నిరుపేదలు లాభపడుతున్నారు.



నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో నిరుపయోగంగా 2డీ ఎకో పరికరం

పోస్టులు భర్తీ చేయాలి



నిర్మల్ ఆస్పత్రిలో కార్డియాలజిస్టులు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుండగా ఇబ్బందులు పడుతున్నారు. కార్డియాలజిస్టు పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందుబాటులోకి తేవాలి.
– కోరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, నిర్మల్

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం



మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆస్పత్రికి కార్డియాలజిస్ట్ పోస్టులు కేటాయించలేదు. గుండె సమస్యతో వచ్చిన వారికి జనరల్ ఫిజీషియన్‌తో ప్రాథమిక వైద్యం చేయిస్తున్నాం. ఈసీజీ తీయించి పరిస్థితిని బట్టి ఇక్కడే వైద్యం అందిస్తున్నాం. 2డీ ఎకో అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకం కింద ఇక్కడికే ప్రైవేట్ కార్డియాలజిస్టును పిలిపించి పరీక్షలు చేయిస్తున్నాం. పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.
– డాక్టర్ గోపాల్‌సింగ్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

భైంసారూరల్ (ముధోల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాంపూర్‌కు చెందిన సాయన్న, చర్లపల్లికి చెందిన రఫీక్ ఆదివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సుంక్లి గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వానల్‌పాడ్ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ నైలు, స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషాహారం తిని మూడు ఎద్దులు మృతి


ఎద్దు కళేబరం

మామడ: మండలంలోని గాయిద్‌పల్లిలో విషాహారం తిని మూడు ఎద్దులు మృత్యువాతపడ్డాయి. జాదవ్ పండరీకి చెందిన మూడు ఎద్దులు ఆదివారం పంటచేను సమీపంలో మృతిచెంది ఉన్నాయి. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి మహేశ్ సందర్శించి వివరాలు సేకరించారు. విషాహారం తినడంతో మృతి చెందాయని పేర్కొన్నారు. వీటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఇంద్రవెల్లి: అనారోగ్యంతో ఏఎంసీ మాజీ చైర్మన్ సోమసే వెంకట్‌రావ్(76) మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన ఈయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. 2005లో ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గత కొంతకాలం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. పరిస్థితి విషమించి మండలకేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘటన స్థలానికి చేరుకుని వెంకటరావ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి లోటన్నారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, కాంగ్రెస్ నాయకులు మీర్జా యాకుబ్ బేగ్, ఎండీ మసుద్, జహీర్, గ్రామపటేల్ మారుతి డొంగ్రె తదితరులు ఉన్నారు.

కోరలుచాస్తున్న 'క్షయ'

రెండు వారాలకు మించి దగ్గు ఉందా..అయితే టీబీ అయ్యిండొచ్చు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి ఉచిత పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యులు మందులిస్తారు. చిన్నపాటి దగ్గే కదా అని నిర్లక్ష్యం చేస్తే అదే రేపు ప్రాణాంతకం అవ్వొచ్చు. ముందుగా జాగ్రత్త పడితే ఆరోగ్యం మీ చేతుల్లోనే భద్రంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న క్షయ వ్యాధికి కళ్లెం వేయాలి. అందరం కలిసి క్షయను నిర్మూలించగలం అనే నినాదంతో ఈ ఏడాది ముందుకెళ్తున్నారు. నేడు ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం.

- ఏటా పెరుగుతున్న రోగుల సంఖ్య
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా నిష్ప్రయోజనం
- నేడు ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం

మంచిర్యాలటౌన్: టీబీ నిర్మూలనకు ప్రభుత్వం నడుంబిగించింది. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నా క్షయ వ్యాధి తగ్గుముఖం పట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో చాపకింద నీరులా క్షయ విస్తరించడం, కొన్నేళ్లుగా వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నా, ఏటా బాధితులు పెరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా గత ఐదేళ్లుగా కృషి చేస్తున్నా, ఏటా వీరి సంఖ్య వెయ్యికి పైగానే నమోదవుతోంది.

వ్యాధిని గుర్తిస్తారు ఇలా..

టీబీ.. మైకో బ్యాక్టీరియా ట్యూబర్‌కిలోసిస్ ద్వారా సంక్రమిస్తుంది. ఊపిరితిత్తులకు లేదా శరీరంలోని ఇతర భాగాలకు రెండు రకాలుగా వ్యాపిస్తుంది. 85 శాతం మందికి ఊపిరితిత్తులకే సోకడం గమనార్హం. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, సాయంత్రం వేళ జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీనొప్పి, దగ్గినప్పుడు రక్తంతో కూడిన తెమడ వస్తే వ్యాధి లక్షణాలుగా చెప్పవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. బాధితులకు వ్యాధి తీవ్రత బట్టి ఆరు, ఎనిమిది నెలలు, రెండేళ్ల కోర్సు ప్రకారం మందులు వాడాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తుడు దగ్గినా, తుమ్మినా తుంపర్లు వాతావరణంలో కలిసి బ్యాక్టీరియా ద్వారా ఇతరులకు సంక్రమిస్తుంది. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడతారు. హెచ్ఐవీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, అతిగా మద్యం సేవించేవారు, పొగతాగేవారు, గర్భిణులు, పిల్లల తల్లులు, సరైన పోషకాహారం తీసుకోనివారు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు త్వరగా దీని బారినపడే ప్రమాదం ఉంది. చికిత్సలో భాగంగా వ్యాధిగ్రస్తులు ప్రతీరోజు ట్యాబ్లెట్లను వేసుకునేలా ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) చికిత్స విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ వ్యాధిని నిర్ధారణకు అధునాతన సీబీనాట్(క్యాట్రిజ్ బేస్డ్ న్యూక్లిక్ ఆసిడ్ అంప్లీ ఫికేషన్ టెస్టు) విధానం (క్షయ నివారణ విభాగం కేంద్రం) మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉండగా, బెల్లంపల్లి సీహెచ్‌సీలో టునాట్ మిషన్లను అందుబాటులోకి తెచ్చారు. మంచిర్యాల జిల్లా ఆసుపత్రిలో టీబీ టెస్టుల కోసం ప్రత్యేక గదిని కేటాయించి, సీబీనాట్‌తో పరీక్ష చేసి, చికిత్స అందిస్తున్నారు. టెస్టుల కోసం ట్రూనాట్ మిషన్‌ను ఏర్పాటు చేయగా, అనుమానితుల నుంచి శాంపిళ్లను సేకరించి, వ్యాధిని నిర్ధారిస్తున్నారు.


మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీబీనాట్ యంత్రం

ఐదేళ్లలో గుర్తించిన టీబీ కేసులు

సంవత్సరం	మంచిర్యాల	ఆదిలాబాద్	నిర్మల్
2020	1,138	1218	1529
2021	1,284	1361	1208
2022	1,445	1565	1549
2023	1,413	1467	1378
2024	1,278	1602	1097

చికిత్సతో పాటు నగదు

క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తయ్యే వరకు నిక్షయ పోషణ యోజన కింద నెలకు రూ.వెయ్యి ఇస్తారు. ఈ డబ్బును వారి ఖాతాల్లో జమచేసి, ఆధార్, బ్యాంక్ ఖాతాలతో నిక్షయ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రైవేటు నర్సింగ్‌హోంలు, ల్యాబ్‌లో పరీక్షలు చేసుకుని, వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తుల వివరాలను సమీప ప్రభుత్వ ఆసుపత్రిలోని టీబీ యూనిట్ సిబ్బందికి తెలియజేయాలి. ఈ డబ్బులతో వ్యాధిగ్రస్తుడు బియ్యం, పప్పుదినుసులు, గుడ్లు, పాలు, కూరగాయలు కొనేందుకు గాను ఈ మొత్తాన్ని ఉపయోగించాలి. నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా దాతలు పోష్టికాహార పదార్థాలు అందజేస్తారు.

లక్షణాలుంటే పరీక్ష చేసుకోవాలి



చిన్నారులకు బి.సి.జి టీకా వేయడం వల్ల వారు క్షయ బారిన పడే అవకాశాలు తక్కువ. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధి సోకిన వారికి మందులు అందిస్తున్నాం. రెండు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉండి, సాయంత్రం జ్వరం వచ్చే వారు ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. క్షయ నివారణ జిల్లాగా మార్చేందుకు అందరి సహకారం ఉండాలి.

– హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌వో, మంచిర్యాల

ఆత్మీయ సమ్మేళనం



తాంసిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఒకరినొకరు ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. పూర్వ ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, రఘురమణ, బాపన్న, వాణిశ్రీ, పూర్వ విద్యార్థులు సురేశ్, శ్రీధర్‌రెడ్డి, సంజీవ్, కపిల్, అనిత, సునీత, గణిత, జ్యోత్స్న తదితరులు ఉన్నారు. – తాంసి

సింగరేణి కార్మికుల ప్రయోజనాలే ముఖ్యం

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

నస్పూర్: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలే ముఖ్యమని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సేవాభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సింగరేణి, కాంట్రాక్టు, రిటైర్డు కార్మికుల ఆత్మీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థ మూతపడితే దక్షిణ భారత దేశ పారిశ్రామిక వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అనేక భూగర్భ గనులు, ఓసీలు మూతపడ్డాయని ఆరోపించారు. జైపూర్ పవర్ ప్లాంటు ఏర్పాటు మాజీ సీఎం వైఎస్సార్ ఘనత అని, ఏటా రూ.500 కోట్ల లాభాలను సింగరేణి ఆర్జిస్తోందన్నారు. సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్త గనులు రావాలన్నారు. ఇందుకు సింగరేణి సంస్థ బొగ్గు గనుల వేలంలో పాల్గొనాలన్నారు. డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం, ఉద్యోగులకు రూ.1.50 కోట్ల ఇన్సూరెన్స్, కాంట్రాక్టు కార్మికులకు ఇన్సురెన్స్ సదుపాయం కల్పించామని, 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ రూ.5 వేలు ఇప్పించామని అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, సమ్మయ్య, ధర్మపురి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, రమేశ్, శ్రీనివాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి శ్యాం పాల్గొన్నారు.

ఎద్దులను తరలిస్తున్న రెండు ట్రాలీలు పట్టివేత

కాసిపేట: అక్రమంగా రెండు ట్రాలీలలో 8 ఎద్దులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..వాంకిడికి చెందిన షేక్ ఇసూబ్, షేక్ అసీంలు రెండు ట్రాలీలో 8 ఎద్దులను వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాల్లోని సంతల్లో కొనుగోలు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా రాజారాంపల్లి సంతలో విక్రయించేందుకు ట్రాలీలో వెళ్తున్నారు. శనివారం రాత్రి కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై మధుర జంక్షన్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎద్దులను సంరక్షణ ని మిత్త ం సుల్తానాబాద్‌లోని గోశాలకు తరలించినట్లు పశువైద్యాధికారి పేర్కొన్నారు.

వ్యవసాయ భూమిలో గంజాయి సాగు

- 17 మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు


గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కొర్టికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ భూమిలో పడ్వాల్ దశరథ్ అనే రైతు అంతరపంటగా గంజాయి సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా భూమిని కౌలుకు తీసుకొని మిరప, వంగ, బెండ పంటల్లో అంతరంగా గంజాయి సాగు చేస్తున్నాడనే సమాచారం మేరకు పోలీసులు ఆదివారం తనిఖీ చేశారు. 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. దశరథ్‌తో పాటు ఆయన భార్య సాగర్‌బాయిపై కేసు నమోదు చేయగా, దశరథ్ పరారీలో ఉన్నాడు. సాగర్‌బాయిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పట్టుబడిన మొక్కల విలువ రూ.1లక్ష 70వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

రైతు అరెస్ట్

చెన్నూర్: మండలంలోని కొమ్మెర శివారులోని పత్తి చేనులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న రైతును అరెస్టు చేసినట్లు సీఐ దేవేందర్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన రైతు జనగామ గట్టుమల్లు..కొమ్మెర శివారులో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. అక్రమంగా గంజాయి పెంచితే డబ్బులు వస్తాయని ఆశతో చేనులో అక్కడక్కడ గంజాయి సాగు చేస్తున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు ఆదివారం చేనుకు వెళ్లి అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.గట్టుమల్లును రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందన్‌పల్లి రేంజ్‌లో న్యాయమూర్తి


స్వాగతం పలుకుతున్న రేంజ్ అధికారి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పల్లి రేంజ్‌లో ఆదిలాబాద్ జిల్లా సివిల్ న్యాయమూర్తి ప్రమీల జైన్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పర్యటించారు. న్యాయమూర్తికి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మైసమ్మకుంట, ఘనిషెట్టి కుంట, వాచ్‌టవర్ ప్రాంతాలను పరిశీలించారు. అడవి అందాలను చూసి మురిసిపోయారు. అడవి అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను రేంజ్ అధికారి న్యాయమూర్తికి వివరించారు.

సైబర్ వలలో యువకుడు

- రూ.2.12 లక్షలు పోగొట్టుకున్న వైనం
- మందమర్రిలో ఘటన..కేసు నమోదు

మందమర్రిరూరల్: సైబర్ వలలో పడి యువకుడు రూ.2.12 లక్షలు పోగొట్టుకున్నాడు. మందమర్రిలో ఈఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..పట్టణానికి చెందిన యువకుడికి గూగుల్‌లో రివ్యూ ఇస్తూ డబ్బులు సంపాదించవచ్చని ఒక టెలిగ్రామ్ పేరిట నేరగాళ్ల నుంచి మెసెజ్ వచ్చింది. దానికి అంగీకరించడంతో అతన్ని 3వేల మంది ఉన్న టెలీగ్రామ్ గ్రూప్‌లో యాడ్ చేశారు. ముందుగా పెట్టుబడి రూపంలో కొన్ని డబ్బులు పెట్టాడు. అధిక మొత్తంలో ఆశచూపి తర్వాత రూ.2.12 లక్షలు పెట్టించారు. తర్వాత నగదు విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా నేరగాళ్లు హ్యాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన యువకుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా మహాసభ

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు సంజీవరావు మాట్లాడుతూ ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద దేశాల మెప్పు కోసం పాలకులు పాటుపడుతున్నారని విమర్శించారు. ఓపెన్ కాస్టుల విధ్వంసం, టైగర్ జోన్‌లతో ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారన్నారు. ఓపెన్‌కాస్టుల విధ్వంసాన్ని ఆపాలని, టైగర్ జోన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాల జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా శ్రీ మన్నారాయణ, ప్రధాన కార్యదర్శి జైపాల్‌సింగ్, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, పోశం, అనంద్ సంతోష్, శ్రీనివాస్, సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో జైపాల్‌సింగ్, శ్రీమన్నారాయణ, ప్రజాకళామండలి నాయకులు సమ్మయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, రాజన్న, కుమార్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన టెక్‌ఫెస్ట్


పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంత:ప్రజ్ఞ టెక్‌ఫెస్ట్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను ప్రదర్శించేందుకు టెక్‌ఫెస్ట్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ తెలిపారు. ఇందులో విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలు, పోస్టర్ ప్రజెంటేషన్లు, తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్షన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేటెడ్ డీన్స్, వివిధ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

26న మామిడిపండ్ల తోటల వేలం

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీలో మామిడిపండ్ల తోటల వేలం ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బంగినపల్లి, దసేరి, తోతాపరి, రసాలు, హిమాయత్, లాంగ్ర తదితర మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు. వేలంలో తోట దక్కించుకున్నవారు సగం నగదును వెంటనే చెల్లించాలని మిగతాది వారంలో చెల్లించాలని సూచించారు. ఆ తర్వాతే కాయలు కోయడానికి అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 8897478825, 9441020755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుమురం భీం పేరుతో అవార్డులు గర్వకారణం

- మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి
- సినీనటుడు సాయికుమార్‌కు భీం అవార్డు ప్రదానం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


కుమురం భీం జాతీయ అవార్డు అందుకుంటున్న సాయికుమార్

ఆసిఫాబాద్: కుమురం భీం పేరుతో జాతీయ అవార్డు ప్రదానం చేయడం ఆదివాసీ జాతికి గర్వకారణమని మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో భారత్ కల్చరల్ అకాడమీ, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్, ఓం సాయితేజా ఆర్ట్స్, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, హాస్య నటుడు బాబూమోహన్, మిమిక్రీ కళాకారుడు శివారెడ్డి, నవజ్యోతి వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్‌కుమార్, భీమ్ మనవడు సోనేరావుతో పాటు పలువురు సినీ ప్రముఖులతో కలిసి సినీనటుడు సాయికుమార్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి మాట్లాడుతూ కుమురం భీం జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. అడవి మీద హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలకులతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరుడు కుమురం భీం అన్నారు. అవార్డు గ్రహీత సాయికుమార్ మాట్లాడుతూ కుమురంభీం సినిమాలో నటించి, భీమ్ నడియాడిన ప్రాంతంలో జాతీయ అవార్డు పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కళాకారుడిగా పుట్టడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, కుమురం భీం చరిత్రను ప్రపంచం దృష్టికి తీసుకెళ్తున్న డి సురేశ్‌కుమార్‌ను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది ఉన్నత స్థాయి గిరిజన కళాకారులున్నారని, ఇటీవల గుస్సాడీ నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించిందని గుర్తు చేశారు. నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు దండనాయకుల సురేశ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, ప్రముఖ దేవాలయాలు అభివృద్ధి చేయాలన్నారు. తొలుత జిల్లా కేంద్రంలోని సాయి మందిరం, అంకమ షా సమాధి మందిరాన్ని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సినీ కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో యువ దర్శకుడు నక్క రాహుల్, నిర్మాత రాం సత్యనారాయణ, నటుడు రాంజగన్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, ఆదివాసీ నాయకుడు సిడాం అర్జు, నవజ్యోతి సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, సాయిని రాజశేఖర్, కళాకారులు, ఆదివాసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'భూభారతి'తో రెవెన్యూలో మార్పులు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

మంచిర్యాలటౌన్: భూభారతి చట్టం 2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు 10,954 మంది గ్రామపాలన అధికారులు వచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సైనికులుగా పనిచేస్తామన్నారు. అనతికాలంలోనే ప్రభుత్వ సహకారంతో ఎన్నో విజయాలను సాధించుకున్నామని, తొలిసారి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను ఏర్పాటు చేసి, పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలను మాతృ సంస్థలోకి తీసుకోవడం గొప్ప విజయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, టీజీటీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆలం పోచయ్య, ప్రధాన కార్యదర్శి ఆత్రం ప్రహ్లాద్, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శ్రావణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వీ.సంజీవ్ కుమార్, ఆదిలాబాద్ జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్డీవోలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు

నాణ్యమైన విద్యనందిస్తున్నాం


మాట్లాడుతున్న ఎల్వీ సూర్యనారాయణ

నస్పూర్: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు, పర్సనల్ అడ్మినిస్ట్రేషన్)తెలిపారు. సీసీసీ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన 17వ వార్షికోత్సవానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో విద్యాసంస్థల ద్వారా సింగరేణి ఉద్యోగుల పిల్లలకు, తెలంగాణలోని ఇతర విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు సంస్థ దోహదపడుతుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్, కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ డి నరసింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో అమ్మవారి విగ్రహం

ఖానాపూర్: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజూరా, బావాపూర్(ఆర్), మామడ మండలం కప్పనపల్లి గ్రామాల మధ్య గల దట్టమైన అడవిలో చాముండేశ్వరి అమ్మవారి విగ్రహం బయటపడింది. విగ్రహ పరిసర ప్రాంతంలో 14వ శతాబ్దానికి చెందిన కోట శిథిలాలను ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, ఖానాపూర్ వాసి కరిపె రాజ్‌కుమార్ గుర్తించారు. కోట చుట్టూ చెక్కు చెదరని రాతి కంచె, ఇనుము శుద్ధిచేసిన ఆనవాళ్లు లభ్యమయ్యాయి. కోటకు ఆవల గుప్తానిధుల కోసం జరిపిన తవ్వకాల్లో ఇటీవల ఒక రాతి విగ్రహం బయటపడిందని వివరించారు. గ్రామాల ప్రజలు ఒక చిన్న చెట్టు కింద ఉంచారని, ఆ విగ్రహ ప్రతిమ చాముండేశ్వరి దేవతదని, కాకతీయ అనంతర శైలిలో విగ్రహం ఉందని తెలిపారు. దేవత చతుర్భుజి అని, పర(వెనుక) హస్తాల్లో ఢమరుకం, త్రిశూలం ఉన్నాయని, నిజ (ముందు) హస్తాలలో ఖడ్గం, రక్తపాత్రలతో సుఖాసీనురాలై ఉన్నారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ అమూల్యమైన విగ్రహాన్ని, కోట శిథిలాలను ప్రజలు సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పరిశోధక బృందంలో ఔత్సాహిక పరిశోధక విద్యార్థి కరిపె రాజశేఖర్, గ్రామస్తుడు చిట్నేని పోతన్న ఉన్నారు.


చాముండేశ్వరి విగ్రహం